నమస్తే తెలంగాణ నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
7 ఫిబ్రవరి 2024
పేజీలు 8


### టాప్-2లో తెలంగాణ

ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చడంలో జాతీయస్థాయిలో తెలంగాణ టాప్-2లో నిలిచిందని ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సంస్థ ప్రకటించింది. దేశంలోనే అత్యధికంగా 29.47 లక్షల వీధి దీపాలను అమర్చి ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ 16.82 లక్షలు అమర్చింది. ఈఈఎస్ఎల్ 9వ వార్షికోత్సవంలో ఈ విషయాన్ని జనవరి 7న వెల్లడించింది.

కెరీర్ గైడెన్స్

# సరైన నిర్ణయం.. భవిష్యత్తుకు మార్గం

**అన్నప్రాశనప్పుడు పిల్లల ముందు వివిధ వస్తువులు పెట్టి, వాళ్లు దేన్నయితే పట్టుకుంటారో వారు పెద్దయ్యాక అది ఉపయోగించేది లేదా చేయబోయే కెరీర్ అని చాలామంది అనడం చూస్తూనే ఉంటాం. ఇది ఎంతవరకు నిజమయ్యిందో ఎవరికీ తెలియదు. ఇలా విద్యార్థి జీవితంలో ఎంచుకునే కెరీర్ కూడా ఇంత ఈజీగా ఉంటే బాగుంటుంది. కానీ అలా ఎప్పటికీ జరగదు. ఎంతో ఆలోచించి తీసుకున్న నిర్ణయంపైనే భవిష్యత్తు ముడిపడి ఉంటుంది.**



## సరైన సమయం


- పిల్లలు ఏ స్కూల్‌లో చదవాలి అనేది తల్లిదండ్రులు నిర్ణయిస్తారు. స్కూల్ ఎక్కడ ఉంది, ఫెసిలిటీస్ ఎలా ఉన్నాయని ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. ఇంకాస్త అయితే ఏ బోర్డులో చేర్పించాలి, ఫౌండేషన్ కోర్సులు వంటి వాటి గురించి ఆలోచిస్తారు. అందరు పిల్లలు రాసేవే టెన్త్ పరీక్షలు. ఆ తర్వాత రాసే పరీక్షలు వాళ్లు తీసుకున్న నిర్ణయాన్ని బట్టి ఉంటాయి. తల్లిదండ్రులు తీసుకునే ఈ మొదటి మేజర్ నిర్ణయం వారి భవిష్యత్తుకు మార్గాన్ని నిర్ణయించే మొదటి అవకాశం. పదో తరగతి తర్వాత ఏంటి? అని ఆలోచించే సమయం వచ్చేసింది. మీ నిర్ణయం ఏంటి? భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన నిర్ణయం ఇంజినీరింగ్, మెడిసిన్, లా, డిజైన్, చార్టెర్డ్ అకౌంటెన్సీ, సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్ ఇలా ఎన్నో అవకాశాలున్నాయి. కానీ ఏది మనకు తగినదని అలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఒకప్పుడు తెలిసినవారు చెప్పే విషయాలపై దృష్టి పెట్టేవాళ్లం. కానీ ఈ జనరేషన్‌కి అన్నీ ఇంటర్నెట్‌లో దొరుకుతున్నాయి. తల్లిదండ్రుల ప్రొఫెషన్స్‌కు భిన్నం గా విద్యార్థులు కెరీర్‌ని ఎంచుకుంటున్నారు. సోషల్ రికగ్నైజేషన్, కెరీర్ ఇన్ న్యూస్, టైంఫర్ సెటిల్‌మెంట్, ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఇలాంటి మాటలు వారి నోటి నుంచి వినిపిస్తున్నాయి.
- కొవిడ్ సమయంలో హెల్త్ కేర్ ప్రొఫెషనల్, ఫార్మా రంగం వారి సేవలు అనేకం. వారికి దొరికిన గౌరవాన్ని బట్టి నిర్ణయాలు లేదా చంద్రయాన్ వంటి ప్రయోగాలతో ఏరోస్పేస్ పట్ల మక్కువ. అలాగే కంప్యూటర్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఇంజినీరింగ్ అంటే ఇంట్రస్ట్. యూట్యూబ్, సోషల్ మీడియా వల్ల ఆర్ట్స్, మీడియా, పర్ఫామింగ్ ఆర్ట్స్‌పై దృష్టి. ఇలా వివిధ రకాల ప్రొఫెషన్స్‌ని ఎంచుకుంటున్నారు.

## అభిరుచికి తగ్గట్టు

- దీంతో పాటు చుట్టూ ఉన్నవారి సలహాలు. ఇక ఆర్థికంగా ఉన్నవారు ఇంటర్ తర్వాత విదేశీ విద్య శాట్ అని కూడా ఆలోచిస్తారు. ఇంజినీరింగ్ చదవాలంటే ఎంపీసీలో చేరాలి, మెడిసిన్‌కి బైపీసీ, ఇలా భవిష్యత్తులో మనం ఏ కెరీర్‌ను ఎంచుకుంటే దానికి అనుగుణంగా ఇంటర్‌లో సబ్జెక్టులు తీసుకోవాలి. ఏ రంగం ఎంచుకున్నా ఎన్నో అవకాశాలున్నాయి. కానీ ఇక్కడ రంగాలు, పరీక్షలు, అవకాశాలు అనేది కాకుండా మీరేం చేయాలనేది ఆలోచించాలి. మీరు ఏ కెరీర్ ఎంచుకోవాలన్నది ఎలా ఆలోచిస్తున్నారు? ఎంత ఆలోచిస్తున్నారు?


**కెరీర్‌ని ఎలా ఎంచుకోవాలి?**

- కెరీర్‌ని ఎలా నిర్ణయించుకోవాలని ఎవరినైనా అడిగితే మొదట వచ్చే జవాబు అవకాశాలు, మార్కెట్‌లో ఆ కెరీర్‌కి ఉన్న విలువ అని, కొందరు ఉద్యోగంలో స్థిరత్వం, ఉద్యోగం పట్ల తృప్తి అని. ఇవి సరైనవి అయినా.. ప్రయారిటీ ఆర్డర్ గురించి తెలుసుకుందాం.
- ఒకప్పుడు పబ్లిక్ సెక్టార్ పట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది. ఇప్పటికీ ఉంది. కానీ కొన్ని విభిన్నమైన ఆలోచనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు నాసాలో చేరుతావా అని అంటే, పే స్కేల్ గురించి ఆలోచించే వారు ఉన్నారు.
- కాలం గడిచిన కొద్దీ కొన్ని కెరీర్ల పట్ల అవగాహన పెరుగుతుంది. కంప్యూటర్ సైన్స్ మొదట్లో ఇంట్రడ్యూస్ చేసినప్పుడు, చాలామంది ఎటర్నల్ బ్రాంచెస్ అయిన మెకానికల్ పట్ల మక్కువ చూపారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాల్లోనే స్టోరీ మారింది.
- ఒకప్పుడు క్రికెటర్‌ని అవుతానంటే స్పోర్ట్స్‌లో అవకాశాలు తక్కువ అనే వారు. అది నిజమే కదా. దేశంలో క్రికెట్ అంటే ఎంతో క్రేజీ ఉంది. కానీ మొదట్లో ఇప్పటి వలే ఇన్ని మ్యాచులు ఉండేవి కావు. 1983 వరల్డ్ కప్ విజేత జట్టు వేతనం వందల్లో ఉండేది. సచిన్ టెండూల్కర్ క్రికెట్ ఆడటం మొదలు పెట్టినప్పుడు అవకాశాలు, వేతనం గురించి ఉంటే అతడి అద్భుతమైన ఆటను మిస్ అయ్యేవాళ్లం. ఇప్పుడు క్రికెట్ పట్ల ఇంత ఆసక్తి ఉండేదో లేదో తెలియదు.
- ఎప్పుడైనా సరే ఎంచుకునే కెరీర్‌ని మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలి. ఆసక్తి (ఇంట్రెస్ట్), సామర్థ్యం (క్యాపబిలిటీ), విలువ (మార్కెట్ వ్యాల్యూ). మార్కెట్లు మారుతుంటాయి. కాబట్టి ఒక మార్కెట్ వ్యాల్యూ ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకుంటే కష్టం.
- ఆసక్తి, సామర్థ్యం, మార్కెట్ వ్యాల్యూ ఈ మూడు ఎంతో కొంత సమతుల్యత ఉండటం అవసరం. దీన్ని బట్టి ఎంచుకునే కెరీర్ ఉండాలి.



## ఆసక్తి

- ఇంట్రెస్ట్ చాలా సాధారణమైన పదం. ఒక విషయం గురించి తెలుసుకోవాలని లేదా నేర్చుకోవాలనే ఆసక్తి. కానీ ఇంట్రెస్ట్‌ని సరిగ్గా గుర్తిస్తున్నారా?, ఇది షార్ట్ టర్మా లేక లాంగ్ టర్మా?. చిన్నప్పుడు కార్టూన్స్ చూసినప్పుడు ఫైర్ మ్యాన్ అవుతానని లేదా బుక్స్ చదివినప్పుడు ఆస్ట్రోనాట్ అవుతానని, ఆ తర్వాత ఇంకోటి ఇవి టెంపరరీ ఫీలింగ్స్. కానీ కెరీర్ అలా కాదు. ఆసక్తి అనేది కేవలం ఆలోచనతో ఆగిపోకూడదు. ఆ ఆసక్తిని ఆశయంగా మలచుకొని అటువైపు చేసే ప్రయత్నం, ప్రయాణం ముఖ్యం.
- కెరీర్ గురించి ప్రశ్నించినప్పుడు రెండు రకాల జవాబులు ఆలోచింపజేస్తాయి. ఒకటి ఇంజినీరింగ్ ఎందుకు చేశావు అని ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్‌ని ప్రశ్నిస్తే అమ్మ చెప్పింది లేదా నాన్న చెప్పారు అని, రెండోది పురావస్తు శాస్త్రవేత్త అవాలనుకుంటున్నాను, కానీ తల్లిదండ్రులు అభ్యంతరం చెబుతున్నారు అని.
- తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. వారితో చర్చించి ప్రయాణం మొదలు పెట్టాక, సాధించాక ఇక వారి ఇష్టం అని అంటే ఆ విభాగంలో ఎక్కువ ఉన్నత స్థాయికి వెళ్లడానికి ఇబ్బందిపడుతారు. అదే ఆ నిర్ణయాన్ని అంగీకరించి సొంత నిర్ణయంగా మలుచుకుంటే వచ్చే ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కునే ప్రయత్నం చేయవచ్చు. అలాగే హాబీ కెరీర్ డిఫరెంట్. హాబీని కెరీర్‌లా మలుచుకోగలమా, అది ఆలోచించి అవకాశాలను బట్టి తీసుకోవాల్సిన నిర్ణయం.
- పురావస్తు శాఖ లాంటి ఎక్కువగా తెలియని ప్రొఫెషన్స్ గురించి ఆలోచించినప్పుడు పేరెంట్స్ ఎక్కువ మక్కువ చూపకపోవచ్చు. మన చుట్టూ ఉన్నవారు చదివిన చదువు పట్ల మనకు ఒక అవగాహన ఉంటుంది. అది సరైనదని అనుకుంటాం. అందులో తప్పు లేదు. ఆ తల్లిదండ్రులు సంకోచించడంలో తప్పులేదు. కానీ మీరు ఆ కెరీర్ కోసం ఎలా చదవాలి, ఏం చదవాలి, ఎక్కడ చదవాలి, ఎలాంటి అవకాశాలున్నాయి అనే విషయాలపై పూర్తి అవగాహన తెచ్చుకొని, క్రమశిక్షణతో చదువుతాను అని దృఢ సంకల్పంతో వారికి చెబితే వారు తప్పక అంగీకరించవచ్చు. ఆసక్తి అనేది కేవలం ఆ కోర్సు పేరు తెలిసి ఉండటం కాదు, దాని గురించి లోతైన అవగాహన కలిగి ఉండటం.
- మనకిష్టమైన దాని కోసం ఎంతైనా కష్టపడటంలో ఇబ్బందిపడం, ఇష్టం లేనిదైతే చిన్న ఆటంకాన్ని కూడా పెద్ద అవరోధంలా చూస్తాం, మీ ఇష్టాలు, అయిష్టాలు సరైనవేనా అని ఆలోచించాలి.



## సామర్థ్యం

- జెర్సీ సినిమాలో హీరోకి క్రికెట్ పట్ల ఆసక్తి, ఆడగలిగే సామర్థ్యం ఉంది. కానీ ఆరోగ్యం సహకరించి ఉంటే అతడి క్రికెట్ ప్రొఫెషన్ పరిపూర్ణంగా ఉండేది.
- పరీక్షలు రాయడానికి నాలెడ్జ్, స్కిల్స్ అవసరం. అలాగే కొన్ని ఉద్యొగాల్లో సెలక్షన్స్‌కి ఫిజికల్, మెంటల్ ఎబిలిటీ అవసరం. కమ్యూనికేషన్ స్కిల్స్, మెమరీ, డెసిషన్ మేకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ ఇలా ఎన్నో ఉండాలి. కొన్ని నేర్చుకుంటే వస్తాయి. మరికొన్ని కృషి చేస్తే వస్తాయి. ఆ ఎఫర్ట్ పెట్టే ఎబిలిటీ ఉండాలి. అమ్మానాన్న చదివించగలరు, టీచర్స్ చదువు చెప్పగలరు. కానీ విద్యార్థుల ప్రొఫెషనల్ సక్సెస్ వారి ప్రయత్నంలో, వారి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.
- ఏ చదువులో అయినా ఆ చదువుకు తగ్గ సబ్జెక్ట్స్‌ను నేర్చుకోగలగాలి. ఆ కెరీర్‌కు కావలసిన స్కిల్స్‌ని పెంపొందించుకోవాలి. ఆ సబ్జెక్ట్ ఎలా చదవాలి, అది మీరు చదవగలరా లేదా అని బేరీజు వేసుకుని నిర్ణయించుకోవాలి. సాధించే సామర్థ్యం లేకపోతే అనుకున్నది సాధించడం కష్టం. సాన పెడితేనే రాయి వజ్రం అవుతుంది.

## మార్కెట్ వ్యాల్యూ

- పే స్కేల్, ప్లేస్‌మెంట్ ప్యాకేజెస్ గురించి విన్నాం, వింటున్నాం. హయ్యెస్ట్ ప్యాకేజీ, యావరేజ్ ప్యాకేజీ రెండూ ఉంటాయి. మీ రోల్ ని బట్టి, మీ మీద యాజమాన్యానికి ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్‌ని బట్టి మీ పే ఉంటుంది. అలాగే సాధించే దాన్ని బట్టి గ్రోత్ ఉంటుంది.
- అలాగే ఎవరైనా చదువు పూర్తయ్యింది అనగానే ఉద్యోగం వచ్చిందా, జీతం ఎంత అని అడుగుతారు. వారికి తెలిసిన పెద్ద కంపెనీ అయితే వావ్ అంటారు. తెలియని పెద్ద కంపెనీ అయితే అంత ఉత్సాహం ఉండదు. వాట్ డూ యూ వాంట్? హౌ మచ్ డూ యూ వాంట్? అని ఆలోచించండి.
- 2000లో డాట్ కామ్ బబుల్, 2008 ఆర్థిక మాంద్యం, 2020-21 కొవిడ్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయి. కాబట్టి మార్కెట్ వ్యాల్యూపై మాత్రమే ఆధారపడకండి ఎందుకంటే సమాజంలో అన్ని వృత్తుల వారు అవసరం. ఎంచుకున్న కెరీర్‌లో నిష్ణాతులైతే ఎటువంటి పరిస్థితుల్లో అయినా నెగ్గుకు రావచ్చు.
- ఒక నిర్ణయం తీసుకుని, దానికి తగిన పరీక్షలు రాసి, 12వ తరగతి తర్వాత ఆ కెరీర్‌కి సంబంధించిన కోర్సుల్లో చేరుతారు. తర్వాత ఏంటి? గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేవరకు ఇంకేం ఆలోచించాల్సిన పని లేదని అనుకోవద్దు. కెరీర్‌కి కావాల్సిన స్కిల్స్, నాలెడ్జ్‌లను సమకూర్చుకోవాలి.
- 12వ తరగతి తర్వాత చేరే కాలేజీ కెరీర్‌లో చేరుకోవాల్సిన గమ్యంలోని మొదటి మైలు రాయి మాత్రమే. అసలైన ప్రయాణం ముందుంటుంది.
- జాగ్రత్తగా అడుగులు వేయండి. అనుకున్నది సాధించండి.



Sirisha Reddy
Director - Academics
Gyanville Academy
+91 76759 62248
www.gyanville.in
IITJEE | CLAT | IIM IPM